
సాక్షి నంద్యాల

శనివారం ; 18 ; మార్చి ; 2023



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.



ఉరిమిన మేఘం

జిల్లాలో అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, మిడుతూరు మండలాల్లో పంటలు భారీగా దెబ్బతిన్నాయి. IVలో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	21.6
గరిష్టం	33.0

న్యూస్‌రీల్

వాటర్‌గ్రిడ్ పనులు 50 శాతం పూర్తి



మహానందిలో మాట్లాడుతున్న సీఈలు నిర్మల్ చిత్తోరా, కుల్దీప్ బాద్యల్

మహానంది: డోన్ నియోజకవర్గంలో రూ. 297 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులు 50 శాతం పూర్తయినట్లు జలశక్తి పథకం సీఈలు నిర్మల్ చిత్తోరా(రాజస్థాన్), కుల్దీప్ బాద్యల్ తెలిపారు. నిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చిన వారు శుక్రవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డిలు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్థానిక చైర్మన్ చాంబర్‌లో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో వాటర్‌గ్రిడ్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా డోన్ నియోజకవర్గంలో 138 గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందుతుందన్నారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన యాభై శాతం పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించామన్నారు. డోన్, బేతంచర్ల, ప్యాపిలి మండలాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశామని చెప్పారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈలు మురళీకృష్ణనాయక్, పవన్‌కుమార్, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు, మెగాపవర్ ప్రాజెక్ట్ మేనేజర్ వాసు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,297 మంది గైర్హాజరు

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రెండవ రోజు పరీక్షకు 1,297 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి శుక్రవారం తెలిపారు. పార్ట్–1 లో ఇంగ్లిషు పేపర్ 1 పరీక్షకు కర్నూలు, నంద్యాల జిల్లాలలో 36,768 మంది విద్యార్థులలో 35,471 మంది హాజరయ్యారు. ఇందులో జనరల్ ఇంటర్ విద్యార్థులు 32,564 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,907 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అడ్మిషన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

నంద్యాల(సిటీ): విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు అడ్మిషన్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ స్కూళ్లలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు వచ్చే నెల 4వ తేదీ నాటికి ఐదేళ్లు, స్టేట్ సిలబస్‌ను అనుసరించే స్కూళ్లను ఎంపిక చేసుకోవాలనుకునే పిల్లలు ఈ ఏడాది జూన్ 1వ తేదీ నాటికి 5 ఏళ్లు పూర్తయి ఉండాలన్నారు. ప్రైవేటు పాఠశాలు పోర్టల్‌లో నమోదుకు ఈ నెల 19వ తేదీ వరకు అవకాశం ఇచ్చారని, గతంలో 16వ తేదీ వరకు మాత్రమే ఉండేదన్నారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే నెల 10వ తేదీ వరకు గడువు విధించారన్నారు.

పల్లకీలో విహరించిన ఆదిదంపతులు

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు, అష్టదిక్కుల్లో బలిహరణ సమర్పణ పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.

గురుకులం పిలుస్తోంది!

జిల్లాలో అంబేడ్కర్ గురుకులం విద్యాలయాలు భర్తీ చేయనున్న సీట్లు

విద్యాలయం	5వ తరగతి	ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ	ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ
ఆళ్లగడ్డ (బాలిక)	80	40	40
ఆళ్లగడ్డ (బాలిక)	80	40	40
కోవెలకుంట్ల(బాలిక)	80	40	40
లక్ష్మాపురం(బాలిక)	80	40	40
డోన్ (బాలిక)	80	40	40
జూపాడుబంగ్లా (బాలురు)	80	40	40
డోన్ (బాలురు)	80	40	40
మొత్తం	560	280	280



గురుకులంలో విద్యార్థినులు

ఆహ్లాదకర వాతావరణం.. పౌష్టికాహార భోజనం.. కార్పొరేటు స్థాయిలో ఆధునిక టెక్నాలజీ బోధన.. క్రీడల్లో శిక్షణ.. ఇష్టమైన రంగాల వైపు ప్రోత్సాహం.. ఇవన్నీ గురుకులం విద్యాలయాల్లోనే సాధ్యం. రూ. లక్షలు పోసి కార్పొరేటు విద్యా సంస్థల్లో చదవలేని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గురుకులాలు వరంగా మారాయి. అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న ఈ పాఠశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తుండటంతో తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

- అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- కార్పొరేట్ స్థాయిలో వసతి, విద్య ఉచితం
- దరఖాస్తుకు ఈనెల 24 వరకు గడువు
- ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష
- జిల్లాలో ఇంటర్‌లో 480, 5వ తరగతిలో 480 సీట్లు

ఆళ్లగడ్డ: కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు చూస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో ఈ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరిగాయి. దీంతో గత మూడేళ్లుగా ప్రవేశాలకు పోటీ పెరుగుతోంది. ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. 2023 – 24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశాల కోసం ఇటీవల ప్రకటన వెలువడింది. నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు ఆరు గురుకుల కళాశాలలు ఉండగా ఈ విద్యా సంవత్సరం డోన్‌లో మరో గురుకుల కళాశాల ప్రారంభం కానుంది. దీంతో మొత్తం ఏడు కళాశాలలు కాగా.. ఇందులో ఐదు బాలికలు, 2 బాలురకు కేటాయించారు. ఒక్కో కళాశాలలో ఐదో తరగతికి 80 సీట్లు, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 1,120 సీట్లు అందుబాటులో ఉండటంతో విద్యార్థులు ప్రవేశాలకు పోటీపడుతున్నారు. ఇందులో సీటు వస్తే వసతితో పాటు ఉన్నత ప్రమాణాల, కార్పొరేటు విద్యాసంస్థలతో సమానంగా బోధన అందుతుంది. 5వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు పూర్తి ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్య పొందవచ్చు. ప్రస్తుతం ఆరు గురుకులాల్లో దాదాపు 3,500 మంది విద్యార్థులు చదువుతుండగా.. డోన్‌లో నూతనంగా ప్రారంభిస్తున్న పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం మరో 600 మందికి అవకాశం లభించనుంది.

దరఖాస్తు ఇలా..

విద్యార్థులు నెట్ సెంటర్‌లో, సమీపంలోని ఏదైనా గురుకుల పాఠశాలల్లో నమోదు చేసుకోవచ్చు. విద్యార్థి ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్, తల్లి బ్యాంకు పాస్ బుక్, ఫోన్‌నెంబర్‌తో లింకైన ఆధార్‌కార్డు తప్పనిసరి. 5వ తరగతికి https@//apgpcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా, ఇంటర్ మొదటి సంత్సరం ప్రవేశాలకు https@//apgpcet.apcfss.in//inter వెబ్‌సైట్‌లో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలి.

ప్రవేశ పరీక్ష తేదీ..

5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వెబ్‌సైట్ నుంచే పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచే హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గురుకులాల ప్రత్యేకతలివే..

- సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ మీడియంలో బోధన
- విద్యార్థులపై 24 గంటల పర్యవేక్షణ
- ఉత్తమ ర్యాంకులతో ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం ఐఐటీ, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు నిపుణులతో శిక్షణ
- అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ, వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో ప్రవేశాలు పొందేలా ఉత్తమ శిక్షణ
- అత్యాధునిక డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, ఆంగ్ల భాషలో మాట్లాడేందుకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై తరగతులు
- పాఠ్యాంశాలతోపాటు సహ పాఠ్యాంశాలు, క్రీడలు, యోగా, యుద్ధ విద్యల్లో తర్ఫీదు



గురుకుల పాఠశాల

ఐఐటీ, నీట్‌లలో శిక్షణ

ఇంటర్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు నీట్, ఐఐటీ శిక్షణకు సంబంధించి ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. ఈ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి బాలురకు కర్నూలు జిల్లా చిన్నటేకూరు, బాలికలకు గుంటూరు జిల్లా గోరంట్ల, విజయవాడ ఈడ్పుగల్లు కళాశాలల్లో శిక్షణ ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 700 సీట్లు కేటాయించి ఇంటర్ మీడియట్‌తో పాటు నీట్, ఐఐటీలో శిక్షణ ఇస్తారు.

అర్హతలు

5వ తరగతిలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2014 ఫిబ్రవరి 2వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. కుటుంబ ఆదాయం రూ. లక్షకు మించకూడదు. ఏదైనా ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతుండాలి. ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరానికి 2022-23లో పదో తరగతి (ఇంగ్లిష్ మీడియం) పూర్తి చేయాలి.

జాగ్రత్తగా దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఒకసారి సబ్మిట్ చేసిన తరువాత మళ్లీ మార్చుకునే అవకాశం ఉండదు. సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు సమీపంలోని గురుకులానికి వస్తే అక్కడ సిబ్బంది సహకారం అందిస్తారు. పరీక్ష రాసేందుకు వారికి సమీపంలోని విద్యాలయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

– సీహెచ్‌కే సంధ్యారాణి, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, ఆళ్లగడ్డ

భావిపౌరులుగా తీర్చిదిద్దుతున్నాం



విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నాం. ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుంది. గురుకుల విద్యాలయల్లో విద్యార్థులకు అమ్మఒడి, విద్యాకానుక, ఉచిత పుస్తకాలు, యూనిఫాం అందుతోంది. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఐ.శ్రీదేవి, డీసీఓ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్

ఉగాది మహోత్సవాలకు వేళాయె!

- శ్రీశైలంలో 19వ తేదీ నుంచి ప్రారంభం
- ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకారం, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు
- భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం



ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లకు వాహనసేవ, అలంకరణలు ఇలా..

తేదీ	స్వామిఅమ్మవార్లకు వాహన సేవ	అమ్మవారికి అలంకరణ
19న	భృంగివాహనసేవ	మహాలక్ష్మి
20న	కైలాసవాహనసేవ	మహాదుర్గ
21న	నందివాహనసేవ	మహాసరస్వతి , ప్రభోత్సం, వీరాచార విన్యాసాలు
22న	ఉగాది, పంచాంగ శ్రవణం, రథోత్సవం	రమావాణిసేవిత రాజరాజేశ్వరి
23న	అశ్వవాహనసేవ	భ్రమరాంబాదేవి నిజాలంకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముందే కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు శ్రీగిరికి చేరుకుంటున్నారు. దీంతో క్షేత్రం కన్నడ భక్తులమయమైంది. ఐదు రోజుల పాటు జరుగనున్న మహోత్సవాలను విజయవంతం చేసేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అన్ని విభాగాల అధికారులతో పలు మార్లు సమావేశాన్ని నిర్వహించి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు, ఐటీడీఏ, అటవీ, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉగాది మహోత్సవాలు ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వేదస్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరపూజ, కంకణపూజ, రుత్విగ్వరణం, దీక్షా కంకణధారణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తు హోమం, మండపారాధన, రుద్రకలశస్థాపన తదితర పూజలు నిర్వహిస్తారు. అలాగే భ్రమరాంబాదేవి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, అంకురార్పణ, అగ్రిప్రతిష్ఠాపన, నిత్యహవనములు జరిపిస్తారు.

శాస్త్రోక్తంగా స్వామిఅమ్మవార్ల కైంకర్యాలు..

ఉగాది మహోత్సవాల నిర్వహణలో జరిగే ఆయా కైంకర్యాలన్నీ శాస్త్రోక్తంగా ఎలాంటి లోపం లేకుండా పరిపూర్ణంగా జరగాలని ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులను, స్థానాచార్యులను ఈఓ ఆదేశించారు. నిర్దేశించిన సమయానుకూలంగా ఆయా పూజాదికాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.

ఇక 'హాయివే'లు

- రూ.2.516 కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి
- ఇందులో రూ.461 కోట్లతో భూసేకరణ
- 208.781 కిలోమీటర్ల మేర బాగు పడనున్న రహదారులు
- నెలన్నర లోగా నాలుగు రోడ్లకు టెండర్లు
- ఈ నెలాఖరుకు ఖరారు కానున్న సోమయాజులపల్లె – డోన్ రహదారి టెండర్లు
- రూ.43.35 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లకు కాలానుగుణ మరమ్మతులు



కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల రోడ్లను మెరుగు పరుస్తూనే ... మరో వైపు కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో ఐదు జాతీయ రహదారులను అభివృద్ధి చేయనుంది. ఈ ఐదు జాతీయ రహదారుల పనులు పూర్తి అయితే ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. మంజూరైన ఐదు జాతీయ రహదారుల పనులకు సంబంధించి మరో నెలన్నర రోజుల్లో నాలుగు పనులకు టెండర్లు ఆహ్వానించనుండగా, మరో పనికి సంబంధించిన టెండర్ ఈ నెలాఖరు నాటికి ఖరారు కానుంది. మొత్తం రూ.2516 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ నంబర్: 167 కే, 765, 167 , 340బీలో 208.781 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు అభివృద్ధి చెందనున్నాయి. ఈ వ్యయంలో రూ.461 కోట్లను భూ సేకరణకు వెచ్చిస్తున్నారు. జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి భూములను ఇచ్చిన రైతులకు పరిహారంగా ఈ నిధులను అందించనున్నారు.

మరమ్మతులకు అధిక ప్రాధాన్యం

జిల్లా పలు ఆర్అండ్‌బీ రోడ్లకు కాలానుగుణంగా మరమ్మతులు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి రూ.43.35 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఈఎన్‌సీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పూర్తి అధ్వానంగా తయారైన రోడ్లను ఎంపిక చేసి ప్రతిపాదనలను రూపొందించారు. ఇందులో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు కూడా ఉన్నాయి. రాష్ట్ర రహదారులకు సంబంధించి 16 రోడ్లలో 102.668 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. ఆయా రోడ్లకు ప్యాచ్ వర్కులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్లను కూడా వేయనున్నారు. కర్నూలు – బళ్లారి, కోడుమూరు – ఎమ్మిగనూరు, బిల్లేకల్ – ఎమ్మిగనూరు, గుత్తి – పత్తికొండ (ఆదోని రోడ్డు), పెద్దతుంబలం – కోసిగి (హాల్వి– రాంపురం రోడ్డు), మద్దికెర – పత్తికొండ, ఆలూరు – హోళగుంద (కర్ణాటక సరిహద్దు వరకు) తదితర రోడ్లను ఈ ప్రతిపాదనల్లో చేర్చారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన అనంతరం ఈ రోడ్ల పనులను ప్రారంభం కానున్నాయి.

అభివృద్ధి చెందనున్న హైవేల వివరాలు..

- సంగమేశ్వరం నుంచి నల్లకాల్వ (93/819 నుంచి 124/530 కిలోమీటరు) వరకు, వెలుగోడు నుంచి నంద్యాల (141/700 నుంచి 173/560 కి.మీల) వరకు మొత్తం రూ.776.17 కోట్లతో 62.571 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు జరగనున్నాయి. ఇందులో భూ సేకరణకు రూ.165 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- ప్రకాశం జిల్లాకు సంబంధించి దోర్నాల నుంచి కుంట (244/0 నుంచి 268/700 కి.మీల) వరకు మొత్తం రూ.244.83 కోట్లతో 24.20 కి.మీల మేర పనులు చేపట్టనున్నారు. ఇందులో భూసేకరణకు రూ.51 కోట్లు వెచ్చించనున్నారు.
- నంద్యాల నుంచి జమ్మలమడుగు (186/02 నుంచి 248/010 కి.మీల) వరకు మొత్తం రూ.690 కోట్లతో 62.01 కి.మీల మేర పనులు చేయనున్నారు. ఇందులో భూసేకరణకు రూ. 135 కోట్లు వెచ్చించనున్నారు.
- రూ.155 కోట్లతో 7 కి.మీల మేర ఆదోని బైపాస్ రోడ్డు పనులు చేపట్టనున్నారు.
- సోమయాజులపల్లె నుంచి డోన్ (0/0 నుంచి 53/0 కి.మీల) వరకు రూ.650 కోట్లతో 53 కి.మీల మేర రోడ్డును వేయనున్నారు. ఇందులో భూసేకరణకు రూ.110 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ రోడ్డు పనులకు సంబంధించిన టెండర్ ఈ నెలాఖరు నాటికి పూర్తి కానుంది.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు

నంద్యాల: ద్వాదశి జ్యోతిర్లింగమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో ఈనెల 19 నుంచి నిర్వహించే ఉగాది ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతులు అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ దేవస్థాన, జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటినరీ హాల్‌లో ఉగాది ఉత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, వైద్య శిబిరాలు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ ఏడాది దాదాపు 5 లక్షల మంది వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ రీతిలో ఏర్పాట్లు చేయాలన్నారు. నడక దారిన వచ్చే భక్తులకు తాగునీరు, వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. హోటళ్లు, దుకాణాదారులు అధిక ధరలు విక్రయించకుండా సివిల్ సప్లయ్, లీగల్ మెట్రాలజీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచే శ్రీశైలం వెళ్లే భక్తులను పర్యవేక్షిస్తున్నామని, ఇప్పటికే శ్రీశైలంలో 150 మంది పోలీసులు బందోబస్తులో ఉన్నారన్నారు. భక్తులతో సమన్వయం ఉండేలా కర్ణాటక నుంచి కూడా 300 మంది పోలీసులు బందోబస్తుగా వస్తున్నారని వారితో కలిసి సంయుక్తంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. అన్ని పార్కింగ్ ప్రదేశాలలో కన్నడ మాట్లాడే వ్యక్తులను అనౌన్సర్లుగా ఏర్పాటు చేయాలని దేవస్థాన ఈఓ లవన్నకు సూచించారు. శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న మాట్లాడుతూ గత ఉగాది ఉత్సవాల్లో చేపట్టిన కార్యక్రమాలు, ఈ ఏడాది ఉగాదికి చేపడుతున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంతరాలయంలో గర్భాలయ అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు ఈనెల 23వ తేదీ వరకు నిలుపుదల చేశామని, అలంకార దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి అలెన్ చాలంగ్ టెరాన్ మాట్లాడుతూ ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లమల ఘాట్ రోడ్డులో 24 గంటల పాటు వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థినులు క్షేమం

• జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల/పాణ్యం: నెరవాడ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని, వారి ఆరోగ్యం కుదుట పడిందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. అస్వస్థతకు గురై నంద్యాల సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురైనట్లు సమాచారం రాగానే రెవెన్యూ, ఆరోగ్య అధికారులను అప్రమత్తం చేశామన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించామన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా 44 మంది అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 31 మంది డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన 13 మంది విద్యార్థులను కూడా సాయంత్రం డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాలు, తాగునీరు శ్యాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని రిపోర్టులు రాగానే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పాఠశాలలో విచారణ

నెరవాడ గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేస్తామన్నారు. విద్యార్థినులకు చికిత్స అందించేందుకు ఐటీడీఏ నుంచి వైద్యులు వచ్చారన్నారు. బాలికలు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ మేరీ సలోమి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ఎమ్మెల్యే ఆరా



గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై వాకబు చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావుతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణను కోరారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఐటీడీఏ అధికారులను అడిగి వివరాలు తెలుసుకుని, విచారణ వేగవంతం చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్యం కోసం ముగ్గురు డాక్టర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, మరో ముగ్గురు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఫోన్ ద్వారా ఆయన 'సాక్షి'కి చెప్పారు.

19న మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన జిల్లా మహిళా కబడ్డీ క్రీడాకారిణులు నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికయిన వారు ఈనెల 23 నుంచి 26 వరకు హర్యానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా ఆంధ్రా కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలలో భాగంగా పీఎండీఎస్ గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజుల పాటు భూమిని కప్పి ఉంచే పద్ధతిలో పీఎండీఎస్ వేయాలని స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆప్కో రాష్ట్ర డైరెక్టర్‌గా సుబ్బరాయుడు



నంద్యాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బీసీ సంఘం నాయకుడు అవ్వారి ఎల్లా సుబ్బరాయుడు ఆప్కో రాష్ట్ర డైరెక్టర్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. పట్టణానికి చెందిన సుబ్బరాయుడు ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన ఎంపికపై బీసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సుబ్బరాయుడు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పదవి బాధ్యతలు అప్పగించిన సీఎం, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టంపై ప్రాథమిక అంచనా



దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా పంటల నష్టంపై ప్రాథమిక అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. శుక్రవారం గ్రామాల్లో దెబ్బతిన్న పైర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా పంట నష్టం జరిగినట్లు తెలిపారు. మండలంలోని 265 ఎకరాల్లో వరి, 205 ఎకరాల్లో మినుము, 350 ఎకరాల్లో మొక్కజొన్న, 35 ఎకరాలు పొద్దుతిరుగుడు పంటలకు నష్టం వాటిల్లిందని, ప్రాథమిక అంచనా వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

బొమ్మలసత్రం: లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే సంబంధిత వైద్యాధికారి, చేయించుకున్న వ్యక్తులు, ప్రోత్సహించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టుపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరు స్కానింగ్ కేంద్రాలకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్తగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌కు అడ్వైజరీ కమిటీ తీర్మానించిన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీకి పంపుతున్నామన్నారు. సమావేశంలో డాక్టర్లు ప్రభావతి, అనురాధ, గోపాల్, రేడియాలజిస్ట్ తిరుపతి, రాజశేఖర్, పాల్‌రాజారావు, రవీంద్రనాయక్, రామారావు, సుమలత పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడి.. ఏడుగురికి గాయాలు

రుద్రవరం: మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పలువురిపై దాడి చేయడంతో గాయపడ్డారు. గ్రామానికి చెందిన రామయ్య,బుజ్జిలతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. వెంటనే వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసి చికిత్స చేశారు.అయితే వారిలో ఒకరికి గాయాలు అధికంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు.

20న వాహనాల వేలం

బొమ్మలసత్రం: ఎక్సైజ్ నేరాల్లో జప్తు చేయబడిన వాహనాలను నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ నాగమణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలానికి 1 కారు, 9 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు నిబంధనల మేరకు జీఎస్టీ అదనంగా చెల్లించాలని సూచించారు. వివరాలకు నంద్యాల సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను బకాయిల చెల్లింపులపై వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న గృహాలు, ఖాళీ స్థలాలకు ఈ నెలాఖరులోగా బకాయి ఉన్న పన్నులు ఒకేసారి చెల్లిస్తే ఆయా పన్ను చెల్లింపులపై వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. పట్టణంలో 45,450 పైగా అసెస్‌మెంట్లు ఉన్నాయని వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు



తడిసిన మొక్కజొన్నలను ఎత్తుతున్న మహిళలు



నర్సాపురం వద్ద పడిపోయిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

- జీభత్సం సృష్టించిన వడగండ్ల వాన
- బెంబేలెత్తిపోయిన ప్రజలు
- భారీగా పంట నష్టం
- శిరివెళ్లలో పిడుగుపాటుకు రైతు, పశువులు మృతి
- ఉయ్యాలవాడ వద్ద 800 గొర్రెలు కూడా..

ఉయ్యాలవాడ : మండలంలో గురువారం రాత్రి వడగండ్ల వాన కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు నేల వాలగా, పంట దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. వర్షానికి మండలంలో సాగు చేసిన 1600 ఎకరాల్లో మిరప పంట, వంద ఎకరాల్లో మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, కొండుపల్లె, సర్వాయిపల్లె, హరివరం, తదితర గ్రామాలకు వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలకు చెందిన గొర్రెల కాపరులు మేకలు, గొర్రెలను మేపుకోవడానికి 15 రోజుల క్రితం వచ్చారు. వడగండ్ల దెబ్బకు సుమారు 800కు పైగా మేకలు, గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ. కోటి వరకు మేర నష్టం వాటిల్లిన్నట్లు బాధితులు వాపోతున్నారు. అలాగే కళ్లాల్లో ఆరబెట్టుకున్న మిరప దిగుబడిపై టార్పాలిన్ పట్టలను కూడా కప్పుకునేందుకు వీలు లేకుండా ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన ఒక్కధాటిగా కురవడంతో దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. సుమారు రూ.12 కోట్ల మేరకు మిరప రైతులు నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నష్టం అంచనా వివరాలను నమోదు చేయాల్సి ఉంది. కాగా గురువారం రాత్రి కురిసిన వర్షం 5.సె.మీ వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు వీచిన గాలి, కురిసిన వడగండ్ల వాన భీభత్సం సృషించాయి. పంటలనీ నేల మట్టం కావడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. దిగుబడులు చేతి కొచ్చే సమయంలో వర్షం కురవడంతో భారీగా నష్టపోయామని వాపోతున్నారు. భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే గాలి,వాన తమను నట్టేట ముంచాయని రైతులు లబోదిబోమంటున్నారు. రబీలో వరి,మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగు చేశారు. ఇటీవల మొక్కజొన్న కోతలు మొదలయ్యాయి. దిగుబడులను ఆరబెట్టుకున్నారు. వరి పంట కీలక దశలో ఉంది. ఈ తరుణంలో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని ఆలమూరు, చిత్రేనిపల్లె, నర్సాపురం, రుద్రవరం, చిన్నకంబలూరు,పెద్దకంబలూరు, డీ.కొట్టాల, ఎల్లావత్తుల తదితర గ్రామాల్లో పంటలు బాగా తిన్నాయి. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారి జ్యోతి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆయా గ్రామాల రైతులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను అంచనా వేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అధికారులు నష్టాన్ని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. మండలంలో మొక్క జొన్న 819 హెక్టార్లు, వరి 412 హెక్టార్లు, మినుము 92హెక్టార్లు, ఆముదం 5హెక్టార్లతో దెబ్బతిన్నాయని వాటికి సంబంధించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే గాలి వానకు ఎల్లావత్తులలో 50 గొర్రెలు మృతి చెందాయని పెంపకందారులు వాపోయారు. మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె, పేరూరు తదితర గ్రామాల్లో స్తంభాలు నేలకూలడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు మరమ్మత పనులు చేపట్టారు.

దొర్నిపాడు: మండలంలో భారీ వర్షానికి దెబ్బతిన్న మిర్చి పంటను ఎంపీపీ అ మర్నాథ్‌రెడ్డి, దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి,యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి తదితరులు శుక్రవారం పరిశీలించారు. పొలాల్లో ఆరబోసిన మిర్చి పంట వడగండ్ల వానకు తడిసి ముద్ద కావడంతో వ్యవసాయాధికారి శ్రీ కృష్ణ, ఉద్యానవన శాఖాధికారి నరేష్ కుమార్‌రెడ్డి క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు

శిరివెళ్ల: పిడుగుపాటుకు మండలంలోని మహదేవపురంకు చెందిన తిరుపాటి ఆంజనేయులు(45) మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఐదుగురికి గాయాలయ్యాయి. అలాగే 32 మేకలు, గొర్రెలు, 12 ఆవులు, దూడలు మృత్యువాత పడ్డాయి. గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, వడగండ్ల వానకు ఇసుకపల్లె- నాగుల చెరువు పొలాల మధ్యలో గొర్రెలు, మేకలు, ఆవుల మందపై పిడుగు పాటు సంభవించింది. ఈ ప్రమాదంలో మహదేవపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి తిరుపాటి ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన శంకర్, విశ్వనాథ్, సుభాన్, స్వామి, మద్దిలేటికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పిడుగుపాటుకు 32 గొర్రెలు, మేకలు, 12 ఆవులు, దూడలు మరణించాయని మండల పశువైద్యాధికారి దస్తగిరి తెలిపారు. గడివేముల, బేతంచెర్లకు చెందిన రైతులు మండలంలోని పొలాల్లో జీవాలను మేపుకుంటున్నారు.



దొర్నిపాడులో తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న ఏఓ, ఎంపీపీ



నేలపాలైన మొక్కజొన్న పైరు



ఆలమూరు వద్ద దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- సమస్యలను ప్రస్తావించిన ప్రజా ప్రతినిధులు
- నీళ్లు నమిలిన అధికారులు



అధికారులను ప్రశ్నిస్తున్న ఆర్.జంబులదిన్నె ఎంపీటీసీ సభ్యుడు బాలిరెడ్డి

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు ప్రస్తావిస్తూ ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పరిష్కరించడం లేదని సభ్యులు నిలదీశారు. మండలంలో ప్రజా ప్రతినిధుల మాటను అధికారులు గౌరవించడం లేదని, ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతుల సమస్యలు పట్టడం లేదని సభా దృష్టికి తెచ్చారు. మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. ముందుగా ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అజెండాలోని అంశాలను సభకు చదివి వినిపించారు. వ్యవసాయ శాఖ సంబంధించి ఏఓ రాజేంద్రకుమార్, ఉద్యానవన శాఖ అధికారిణి ధరణీ ప్రగతి నివేదికలు వినిపిస్తుండగానే ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, సత్తిగారి బాలిరెడ్డి, సర్పంచ్‌లు రామమద్దిలేటి రెడ్డి, ప్రసాద్, మేకల ఓబులేస్ కలుగజేసుకొని.. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో అన్నదాతలు నిలదీస్తున్నారని మండిపడ్డారు. గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు మిరప, మొక్కజొన్న, మినుము వేలాది ఎకరాల్లో దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ఎకరాకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి రైతులు పంట సాగు చేశారు. విపత్తు సంఘటనలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో అధికారులు పంటలు పరిశీలించి నష్టపోయిన బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని సభా దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా సభ్యులతో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఎంపీడీఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, మాయలూరు, నొస్సం వైద్యాధికారులు, పశు వైద్యాధికారులు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు హాజరయ్యారు.

ఐటీడీఏ పీఓపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు సంఘటన గురించి వివరిస్తున్న జీపీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): పాణ్యం మండలం నెరవాడ గురుకుల పాఠశాలకు చెందిన 45మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి కారణమైన ఐటీడీఏ పీఓపై చర్యలు తీసుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ డిమాండ్ చేశారు. గురుకుల హాస్టళ్లను పర్యవేక్షించకుండా పీఓ అలసత్వం ప్రదర్శిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు జీపీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. కారకులైన పాఠశాల సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆలిండియా బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్ కోరారు. ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్‌లు కోరారు.

నష్టపరిహారాన్ని అంచనా వేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనీజర్ జిలానీ శామూన్

నంద్యాల: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, కోల్పోయిన పశు సంపదను అంచనా వేసి నష్టపరిహార ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి జయదేవ్ తదితర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి జిల్లాలో 4,906 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 313 హెక్టార్లలో వాణిజ్య పంటలు 769 గొర్రెలు చనిపోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, ఈ మేరకు బీమా ప్రీమియం వర్తింపు, నష్టపరిహార నిమిత్తం చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితులపై విపత్తు నిర్వహణ శాఖ నుంచి సమాచారం తీసుకొని ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంట, పశు నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద పెండింగ్‌లో ఉన్న 38,881 మంది రైతుల ఈ- కేవైసీని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు పొలాల భూసార పరీక్షల గురించి రైతులకు వివరించాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డీఏఓ మోహన్‌రావుకు సూచించారు. ఉల్లి ధర మార్కెట్ ధర కంటే తక్కువగా ఉన్నందున ప్రొక్యూర్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే 10 వేల మెట్రిక్ టన్నుల జొన్న, 24 వేల మెట్రిక్ టన్నుల శనగ పంట లక్ష్యాన్ని కూడా రీచ్ కావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మినీ గోకులం షెడ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీకి సూచించారు.

అన్నదాతలూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



పాతకందుకూరు వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. గురువారం రాత్రి అకాల వర్షంతో పాటు వడంగడ్ల వానకు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిన వెంటనే అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే శుక్రవారం హుటాహుటిన నియోజకవర్గం చేరుకుని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో కలిసి పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన పంట వివరాలు, విస్తీర్ణం అంచనా వేస్తున్నాం. పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతామని చెప్పారు. గొర్రెల యజమానులకు తగిన విధంగా సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ఐడీసీ చైర్మన్ కర్రా గిరిజ, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, పశుసంవర్ధశాఖ ఏడీ వర ప్రసాద్, ఉద్యానశాఖ అధికారి నరేష్‌కుమారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, బుడ్డా చంద్రశేఖర్‌రెడ్డి, పల్లె మహేశ్వర్‌రెడ్డి, గంగాధర్, కందుల వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి గెలుపుపై హర్షం



ఆనంద వ్యక్తం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎంవీ రామచంద్రారెడ్డి గెలుపుపై నంద్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు రామపక్కీర్ రెడ్డి, శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పీఆర్‌టీయూ బలపరిచిన రామచంద్రారెడ్డి ఘన విజయానికి కారకులైన జిల్లా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, హుసేన్‌సాహెబ్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గోస్పాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి గెలుపుపై పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

పార్కును అభివృద్ధి చేస్తాం

నంద్యాల(సిటీ): పట్టణంలోని పద్మావతి నగర్‌లో నున్న పార్కును అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల నిమిత్తం పట్టణంలో ఉన్న 12 పార్కులను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేశామన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

మారిన 'పది'పరీక్ష తీరు

- పేపర్-1, పేపర్-2 విధానం రద్దు
- 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు కుదింపు
- ఇంటర్నల్, బిట్ పేపర్ పద్ధతికి స్వస్తి
- ఒక్కో సబ్జెక్ట్‌కు వంద మార్కులు
- గ్రేడ్ పాయింట్లు తొలగింపు, పాత విధానంలో మార్కుల కేటాయింపు



నంద్యాలలో పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నంద్యాల(సిటీ): పది పరీక్షా విధానంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన విద్యా విధానానికి నాంది పలికింది. ఉమ్మడి (కర్నూలు, నంద్యాల) జిల్లాలో 1,016 పాఠశాలల్లో సుమారు 58,123 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. త్వరలో జరుగనున్న పరీక్షలను పాత పద్ధతిలో కాకుండా కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఇందులో నంద్యాల జిల్లాలోని 454 పాఠశాలల నుంచి 25,336 మంది విద్యార్థులు, కర్నూలు జిల్లా నుంచి 562 పాఠశాలల నుంచి 32,787 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 6,375 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వం చేపట్టిన నూతన పరీక్షా విధానంతో విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరనుంది. ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలను తొలగించి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఒకే పేపర్ విధానం..

గతంలో పేపర్-1, పేపర్-2 పద్ధతిలో పరీక్షలు నిర్వహించే వారు. అయితే అందుకు భిన్నంగా ఒకే పేపర్ పరీక్షను వంద మార్కులకు నిర్వహించనున్నారు. అయితే ఈ పద్ధతిలో విద్యార్థులపై ఉన్న అధిక భారం తగ్గి పఠనాసక్తి పెరుగనుంది. రెండు సార్లు ఒకే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష రాయడానికి విద్యార్థులు పడుతున్న అవస్థలపై పాత పద్ధతైన ఒకే పేపర్‌తో ఒకే పరీక్షతో నిర్వహిస్తారు.

6 పేపర్లు..600 మార్కులు..

గతంలో ఆరు సబ్జెక్టులకు పదకొండు పేపర్లు పరీక్షలు రాయాల్సి వచ్చేంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే నేడు ప్రభుత్వం పేపర్లను కుదించి కేవలం 6 పేపర్లను 600 మార్కులకు పరీక్షలు నిర్వహించనుంది.

ఇంటర్నల్, బిట్ పేపర్ విధానానికి స్వస్తి..

గతంలో ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలతో అదనపు మార్కులను జోడించేవారు. ప్రస్తుతం ఇంటర్నల్ మార్కులను పూర్తిగా తొలగించారు. అలాగే ప్రత్యేకంగా 30 మార్కులకు ఉన్న బిట్ పేపర్‌ను రద్దు చేసింది.

గ్రేడ్ పాయింట్లు తొలగింపు...

గ్రేడ్ పాయింట్ల విధానంతో జరుగుతున్న అనర్థాలకు ప్రభుత్వం ముగింపు పలికింది. గ్రేడ్ పాయింట్ల వల్ల విద్యార్థులకు, ఉన్నత చదువుల్లో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇటీవల ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో చేరడానికి గ్రేడ్ల ఆధారంగా సీట్లు కేటాయింపులో అధికారులు అవస్థలు పడ్డారు.

పరీక్షా సమయం పెంపు..

గతంలో ఉన్న పరీక్షా సమయాన్ని ప్రభుత్వం మార్పు చేసింది. ఈ సమయం గతంలో 3 గంటలు ఉండేది, అయితే అదనంగా 15 నిమిషాల వ్యవధిని పెంపొందించారు. ఈ 15 నిమిషాల నిడివిలో ప్రశ్న పత్రాన్ని చదవడానికి, రాసిన సమాధానాలను సరి చూసుకోవడానికి కేటాయిస్తే పరీక్ష మరింత సమయంతో సమాధానాలు రాసే అవకాశం ఉంటుంది.


ప్రశ్న పత్రాలు ఇలా ఉండనున్నాయి..

- ➡ తెలుగులో పద్యభాగంలో ప్రతి పదార్థాలు, కంఠస్థ పద్యాలు, చిన్న ప్రశ్నలు, వ్యాస రూప ప్రశ్నలు, ఉంటాయి.
- ➡ హిందీలో 1మార్కు పేరాగ్రాఫ్ ద్వారానే ప్రశ్నలు, గ్రామర్, లేఖ, వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి.
- ➡ ఇంగ్లిష్‌లో పేరాగ్రాఫ్ ప్రశ్నలు, గ్రామర్, క్రియేటివిటీ రైటింగ్స్ ఉంటాయి.
- ➡ సామాన్య శాస్త్రం మినహా అన్ని సబ్జెక్టులకు ఒక్కటే ప్రశ్న పత్రం ఉంటుంది
- ➡ సామాన్య శాస్త్రంలో భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక విభాగం, జీవశాస్త్రం పేపర్లను పార్ట్-ఏ, పార్ట్- బీలుగా చేసి ఒక్కో పార్ట్‌కు 50 మార్కులతో ప్రశ్న పత్రాలు ఇవ్వనున్నారు.
- ➡ గణిత శాస్త్రంలో గ్రాఫ్‌లు, సైన్సులో బొమ్మలు గీయడం, సోషల్‌లో 2 మ్యాప్‌లు (ఇండియా, వరల్డ్) ఉండనున్నాయి.

మొత్తంగా నాలుగు సెక్షన్లుగా 33 ప్రశ్నలకు 100 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది.

- ➡ సెక్షన్- ఏలో ఒక్క మార్కు సూక్ష్మ లఘు ప్రశ్నలకు 12 మార్కులు కేటాయిస్తారు.
- ➡ సెక్షన్- బీ లో రెండు మార్కుల తేలికైన ప్రశ్నలు-8 ఉంటాయి.
- ➡ సెక్షన్- సీ లో నాలుగు మార్కుల లఘు ప్రశ్నలు-8 ఉంటాయి.
- ➡ సెక్షన్-డీ లో ఎనిమిది మార్కుల వ్యాసరూప ప్రశ్నలు-5 ఉంటాయి.

పరీక్షల విధానం మారింది..



బోధన ఆధారంగా పరీక్షల్లో ప్రభుత్వం మార్పులు చేపట్టింది. ఈ మార్పులతో విద్యార్థుల అభ్యసనా పద్ధతిలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా బిట్ పేపర్‌ను రద్దు చేసి విద్యార్థులకు అదనపు సమయాన్ని ఇవ్వడం హర్షనీయం. గ్రేడ్ పాయింట్ల పద్ధతిని రద్దు చేసి మార్కులు కేటాయించడం వల్ల ర్యాంకులు తెలుసుకోవచ్చు. ఇంటర్నల్ మార్కుల రద్దుతో విద్యార్థులలో పఠనాసక్తిని పెంచవచ్చు.

– అనురాధ, డీఈఓ, నంద్యాల

క్లుప్తంగా

బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు ఆన్‌లైన్‌లో అనుమతి

● కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): 300 చదరపు మీటర్లలోపు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..300 చదరపు మీటర్లలోపు బిల్డింగ్ ప్లాన్‌ల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉందని, అందులో ఏమైనా సందేహాలు ఉంటే విజయవాడ మునిసిపల్ అధికారులను కలసి నివృత్తి చేసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 4 అర్బన్ లెవల్ బాడీస్, 25 మండలాల్లోని 484 గ్రామాల్లోని ప్రజలు ఆన్‌లైన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్ అనుమతులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

జనరల్ స్టోర్‌పై కేసు నమోదు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని మద్దూర్‌నగర్‌లో ఉన కృష్ణమూర్తి జనరల్ స్టోర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ స్టోర్‌లో నకిలీ ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. చాలా కాలంగా ఈ వ్యాపారం సాగిస్తున్నారని, ఇక్కడ కొబ్బరి నూనె కొనుగోలు చేసిన కొనుగోలుదారులు ప్యారచూట్ కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ కంపెనీకి చెందిన ప్రతినిధి సంతోష్ కుమార్ శుక్రవారం స్టోర్‌లో ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలను పరిశీలించాడు. అందులో నకిలీ ప్యారచూట్ కొబ్బరి నూనె డబ్బాలు ఉన్నట్లు గుర్తించి మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన పోలీసులు పేర్కొన్నారు.

నదితీరంలో మొసలి కలకలం

నందవరం: తుంగభద్ర నదీ తీరంలో మొసలి కలకలం రేపుతోంది. శుక్రవారం ఓ ఆవును తీవ్రంగా గాయపరిచింది. మండలంలోని జొహరాపురం గ్రామానికి చెందిన రైతులు ఉదయం 11 గంటల సమయంలో పశువులు మేపుకునేందుకు తుంగభద్ర నది ఒడ్డున పచ్చిక బయళ్ల వద్దకు వెళ్లారు. అక్కడి రాళ్ల పొదల్లో దాగున్న మొసలి గోవిందుకు చెందిన ఓ ఆవుపై విరుచుకుపడి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కాపరులు అక్కడి నుంచి మొసలిని తరమికొట్టారు. మొసలి దాడితో గ్రామస్తులు ఆందోళనకు లోనవుతున్నారు.

గుండెపోటుతో కన్నడ భక్తుడి మృతి

ఆత్మకూరురూరల్: నల్లమల అటవీ మార్గంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న ఓ కన్నడ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం బాగల్ కోట్ జిల్లా బిళ్ళిగి గ్రామానికి చెందిన రాజు(45) తన కుటుంబ సభ్యులతో కలసి పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరాడు. గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత నాగలూటి వీరభద్రాలయం నుంచి మెట్ల మార్గంలో వెళ్తుండగా హఠాత్తుగా కుప్ప కూలిపోయాడు. కుటుంబీకులు అత్యవసర వైద్య సదుపాయం కోసం ప్రయత్నించినప్పటికీ నల్లమల అడవిలో సాధ్యం కాలేదు. అప్పటికే రాజు మృతి చెందినట్లు గుర్తించిన వారు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. నాగలూటి క్షేత్ర సమీపంలో అత్యవసర వైద్య సహాయం కోసం 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



సంజామల మండలం అక్కంపల్లె సమీపంలో నేలవాలిన మొక్కజొన్న పంట



కోవెలకుంట్ల మండలం అమడాలలో నీట మునిగిన మిరపను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడ మండలం కొండుపల్లెలో నేల కూలిన విద్యుత్తు స్తంభాలు

ఉరిమిన మేఘం.. ఊహించని నష్టం

జిల్లాలో అకాల వర్షం బీభత్సం



ఆళ్లగడ్డ మండలం పాత కందుకూరులో నీట మునిగిన కందికట్టెను గట్టుకు చేర్చుతున్న మహిళ

- 8,099 హెక్టార్లలో పంటనష్టం
- మిరప, మొక్కజొన్న రైతులు కుదేలు
- రూ. కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- కోవెలకుంట్లలో అత్యధికంగా 84 మి.మీ వర్షం
- పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- దాదాపు వెయ్యికి పైగా జీవాలు మృత్యువాత



ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో ఆరబోసిన మిరప వర్షానికి తడిచిన దృశ్యం (ఇన్‌సెట్లో) కొండుపల్లెలో గాలివానకు నేలరాలి నీట మునిగిన మిరప

కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ: వేసవి ప్రారంభంలో అకాల వర్షం అన్నదాతకు అపారనష్టం చేకూర్చింది. జిల్లాలో గురువారం రాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో మేఘాలు గర్జించాయి.. మెరుపులు భయపెట్టాయి. ఉన్నట్టుండి కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చాయి. చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. రేకులషెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. అకాల వర్షానికి రైతులు భారీగా నష్టపోయారు. జిల్లా మొత్తం మీద సగటున 16 మి.మీ. వర్షపాతం నమోదైంది. పాములపాడు, మహానంది, కొత్తపల్లి మండలాలు మినహా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కోవెలకుంట్లలో 84 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉయ్యాలవాడలో 47.2, శిరివెళ్లలో 33, ఆళ్లగడ్డలో 30.8, బనగానపల్లెలో 30.2, దొర్నిపాడులో 28.8, గడివేములలో 22.4, రుద్రవరంలో 21.2, బేతంచెర్లలో 19.8, వెలుగోడులో 19.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో 8,099 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో 3,193 హెక్టార్లలో మిరప, 3,121 హెక్టార్లలో మొక్కజొన్న, 1,347 హెక్టార్లలో వరి, 221 హెక్టార్లలో మినుము, 54 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 67 హెక్టార్లలో కొర్ర, 20 హెక్టార్లలో ఆముదం, 76 హెక్టార్లలో కుసుమ, పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 3,469 హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు అధికారులు ప్రాథమిక నివేదిక పంపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పంటను కాపాడుకోగా దిగుబడులు చేతికందే సమయంలో అకాల వర్షం నీటి పాలు చేసింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసేందుకు శుక్రవారం ఉదయాన్నే వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించారు. వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని చెప్పారు.

మిరప రైతు కంట కన్నీరు..

జిల్లాలో ప్రస్తుతం మిరప పంట కోత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దిగుబడులను కల్లాల్లో ఆరబోసుకోగా అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. దిగుబడులను కాపాడుకునేందుకు వీలులేకుండా పెనుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షంతో పంటంతా తడిసిముద్దైంది. అక్కడక్కడా కోత కోయకుండా ఉంచిన పంట సైతం నేలపాలైంది. అలాగే మొక్కజొన్న, మినుము, బొప్పాయి, నువ్వు, వరి, కంది తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. చాగలమర్రి, రుద్రవరం, గడివేముల, బండిఆత్మకూరు, మిడుతూరు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో 3193.40 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 3,55 మంది రైతులు నష్టపోయారు. అలాగే రబీలో సాగు చేసిన వరి, మినుము, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

విరుచుకుపడిన వడగండ్లు.. భయపెట్టిన పిడుగులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి ఒక్కసారిగా ప్రారంభమైన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, మిడుతూరు, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో భారీగా వడగండ్లు పడటంతో రేకుల ఇళ్లకు చిల్లులు పడ్డాయి. వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. పాత కందుకూరు గ్రామంలో ఒక్కొక్కటి పెద్దపెద్ద బండరాయిలా సుమారు 20 నుంచి 25 కిలోల బరువుతో ఆకాశంలో నుంచి నేలమీద పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేక మంది వర్షం తగ్గిన తరువాత వీటిని ఇళ్లలోకి తీసుకెళ్లారు. ఉయ్యాలవాడ మండలంలో పిడుగుపాటుకు దాదాపు 800 జీవాలు మృత్యువాత పడ్డాయి. వైఎస్ఆర్ జిల్లా, అనంతపురం జిల్లాలకు చెందిన గొర్రెల కాపరులు మేకలు, గొర్రెలను మేపుకోవడానికి 15 రోజుల క్రితం మండలంలోని ఆర్.పాంపల్లె, కొండుపల్లె, సర్వాయిపల్లె, హరివరం, తదితర గ్రామాలకు చేరుకోగా జీవాలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. కోటి వరకు ఉన్నట్లు చెబుతున్నారు. శిరివెళ్ల మండలం మహదేవపురంలో పిడుగుపాటుకు గొర్రెలకాపరి తిరుపాటి ఆంజనేయులు (45) మృతి చెందాడు. ఇసుకపల్లె- నాగుల చెరువు పొలాల మధ్యలో జీవాలు మేపుతుండగా పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆంజనేయులు మృత్యువాతపడ్డాడు. సమీపంలో ఉన్న మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.



మిడుతూరు మండలం తలముడిపిలో నేలవాలిన అరటితోటను పరిశీలిసున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి



శిరివెళ్ల మండలం మహదేవపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెల కాపరి తిరుపాటి ఆంజనేయులు



ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందిన జీవాలు



ఆళ్లగడ్డ మండలం పాత కందుకూరులో గాలివానకు నేల కూలిన మామిడి చెట్లు

టీచర్స్ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీదే

● ఎమ్మెల్సీగా ఎంవీ రామచంద్రారెడ్డి ఎన్నిక ● రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంవీ రామచంద్రారెడ్డి విజయం సాధించారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మధ్య నడిచింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. 169 ఓట్లతో రామచంద్రారెడ్డి గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రకటించారు.

రౌండు రౌండులో ఉత్కంఠ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి రౌండులోనూ ఉత్కంఠ కొనసాగింది. 25 వేల పైచిలుకు ఓట్లు పోలవగా.. ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే 10 వేల మార్కు దాటింది. మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పది మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు ఎంవీ రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మిగిలారు. వాస్తవానికి పోలైన ఓట్లలో 50 శాతం సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. కానీ రెండో ప్రాధాన్యతలో కూడా ఎవరూ 50 శాతం ఓట్లు సాధించలేదు. ఈ దశలో నిబంధనల ప్రకారం విజేతను ప్రకటించవచ్చు. ఇందులో భాగంగానే 169 ఓట్ల ఆధిక్యత ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని విజేతగా నిర్ణయించారు.

ఆసక్తిరేపిన ఎలిమినేషన్

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ అందరిలోనూ ఆసక్తి రేపింది. రామచంద్రారెడ్డి, ఒంటేరు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొనడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో, ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూశారు. ముఖ్యంగా మూడోస్థానంలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని ఎలిమినేట్ చేసే క్రమంలో ఆయన బ్యాలెట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగతా ఇద్దరు అభ్యర్థులకు కేటాయించే సమయంలో విజయం దోబూచులాడింది. ఈ ఓట్లలో ఎక్కువ శాతం ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వెళ్లడంతో ఆయన విజయం ఖాయమనుకున్నారు. కానీ చివరకు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక చూస్తే రామచంద్రారెడ్డికే ఆధిక్యత లభించింది. దీంతో ఆయన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ప్రకటనతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది.

సీఎం ఆశీస్సులతోనే విజయం

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని ఎం.వి.రామచంద్రారెడ్డి తెలిపారు. తన గెలుపునకు సహకరించిన వైఎస్సార్‌సీపీ పెద్దలు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు శుక్రవారం జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. విద్యా సంస్కరణలు అమలు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేశారని, ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరని కొనియాడారు. గతంలో ఎమ్మెల్సీలుగా ఉన్నవారు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టారన్నారు. తాను వారిలా కాకుండా ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

'తొలి ప్రాధాన్యత'లో అభ్యర్థుల వారీ ఓట్లు

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	6,853
కత్తి నరసింహారెడ్డి	4,162
అనిల్ ప్రసాద్‌రెడ్డి	3,212
జీవీ నారాయణరెడ్డి	1,345
ఎంవీ రామచంద్రారెడ్డి	8,846
అనిల్‌కుమార్‌రెడ్డి	186
ఎన్.మాధవరావు	354
రామశేషయ్య	187

(మిగతా నలుగురికి ఒక్కొక్కరికి 100 ఓట్లకంటే తక్కువగానే వచ్చాయి)

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితమిలా..

అభ్యర్థి	వచ్చిన ఓట్లు
మొత్తం పోలైనవి	25,272
చెల్లని ఓట్లు	3,867
ఎంవీ రామచంద్రారెడ్డి	10,787
ఒంటేరు శ్రీనివాసులరెడ్డి	10,618
మెజారిటీ	169

విద్యుత్ శాఖకు వర్షం షాక్!

● రూ. 50లక్షల నష్టం

కర్నూలు(రాజ్‌విహార్): వర్షంతో విద్యుత్ శాఖకు భరీ నష్టం కలిగిందని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి కురిసిన వర్షాలు, ఈదురు గాలులు, ఉరుములు కారణంగా రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల, ఉయ్యాలవాడ, చాగలమర్రి ప్రాంతాల్లో దీని ప్రభావం అధికంగా ఉందని చెప్పారు. 33 కేవీ విద్యుత్ స్తంభాలు 70, 11 కేవీ స్తంభాలు రూ.50 విరిగి పడ్డాయని, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు బ్రేకర్లు, వీసీబీలు ధ్వంసమయ్యాయని, బనగానపల్లె సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద విద్యుత్ టవర్ కింద పడిపోయిందని, దీని తోడు ఎల్‌టీ స్తంభాలు, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో సమారు రూ.50లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఏడీఈలతో పాటు ఏఈలు, ఓ అండ్ ఎం సిబ్బంది రాత్రంతా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

ఉగాది ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



శ్రీశైలంలో భక్తులకు ఆహ్వానం పలుకుతున్న ఉగాది మహోత్సవాల స్వాగత తోరణాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో ఈనెల 19 (ఆదివారం) నుంచి 23వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. తమ ఆడపడుచు శ్రీశైల భ్రామరీకి సారె సమర్పించేందుకు కర్ణాటకవాసులు భారీగా తరలివస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. పలు చోట్ల చలువ పందిళ్ల, విద్యుద్దీకరణ, తాగునీరు, తాత్కాలిక వైద్య శిబిరాలు, బాత్‌రూంలు, మరుగుదొడ్లు తదితరవి కల్పించారు. దేవస్థానం అన్నదాన భవనం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులను అలరించేందుకు ఆలయ పుష్కరిణి వద్ద, భ్రామరీ కళావేదిక వద్ద, శివదీక్షా శిబిరాల వద్ద పలు కన్నడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే స్వామిఅమ్మవార్ల కై ంకర్యంలో భాగంగా గ్రామోత్సవంలో కోలాటం, చెక్క భజన, పగటివేషాలు, బుట్టబొమ్మలు, కన్నడ ప్రాంత డోలు వాయిద్యాలు మొదలైన జానపద కళారూపాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుకభాగం, యజ్ఞవాటిక, ఔటర్‌రింగ్ రోడ్డు మొదలైనచోట్ల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. ప్రైవేట్ బస్సులకు గ్యాస్ గోడౌన్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు.



క్షేత్రంలో ఏర్పాటు చేసిన పైప్‌పెండాల్స్



ఉచిత, శీఘ్ర దర్శన క్యూలైన్లు

అన్ని వ్యాధుల పరీక్షలూ ఒకేచోట

సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి



డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను పరిశీలిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇక నుంచి అన్ని రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు ఒకేచోట చేసేలా భవన నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలో దీనిని ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. నూతన వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. త్వరగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ల్యాబ్ ఇన్వెస్టిగేషన్స్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర పరీక్షలను ఒకేచోట ఉంచనున్నట్లు తెలిపారు. క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్‌లైన జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిస్ట్ గదులను, రక్తనిధిని పరిశీలించారు. మానసిక విభాగం ఓపీని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపి(ఈసీటీ) మిషన్ అందుబాటులో ఉన్నప్పుడు ఎందుకు కేసులు చేయడం లేదని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

సర్వేయర్లు నిర్లక్ష్యం వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- సరిహద్దు రాళ్లు పకడ్బందీగా ఏర్పాటు చేయండి
- 25వ తేదీలోగా ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం పూర్తి కావాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: మండల సర్వేయర్లు నిర్లక్ష్యం వీడి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పీఓఎల్ఆర్ రీ సర్వే, ఫారం-6బీ, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామ్‌ను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో మండల సర్వేయర్లపై ఆరోపణలు వస్తున్నాయని, పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. డివిజన్ స్థాయిలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు రీ సర్వే ప్రక్రియపై పూర్తిస్థాయి శిక్షణ, అవగాహన ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న 4,88,440 మంది ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు పోలింగ్ కేంద్రాల వారిగా బూత్ స్థాయి అధికారులకు రోజువారీ లక్ష్యాలను కేటాయించి లక్ష్యసాధనపై ప్రతిరోజు సాయంత్రం నివేదికలను తనకు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని మండలాల్లో ఫారం-6బీ పూర్తి చేసి వారం రోజుల్లో 95 శాతానికి రావాలన్నారు. ప్రగతి తక్కువగా ఉన్న మండలాలతో ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించి తహసీల్దార్లు ప్రతిరోజు దృష్టి పెట్టి బియాండ్ ఎస్ఎల్‌ఏ లోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

హోరాహోరీగా పట్టభద్రుల పోరు

- ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు ఉత్కంఠగా మారాయి. ఇప్పటివరకూ 9 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం సాధించాలి. కానీ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుంది. శుక్రవారం రాత్రి 11.15 గంటలకు 9వ రౌండు ఓట్లలెక్కింపు పూర్తయ్యింది. ఇప్పటిదాకా వెన్నపూస రవీంద్రారెడ్డికి 84,153 ఓట్లు, టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డికి 82,740 ఓట్లు వచ్చాయి. వెన్నపూస 1,413 ఓట్ల మెజారిటీలో ఉన్నారు. మరో రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం కన్పించలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళితే ఫలితం శనివారం మధ్యాహ్నం తేలే అవకాశం ఉంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,576 ఓట్లు పోలవగా.. ఇప్పటివరకూ 2,16,014 ఓట్లను లెక్కించారు. అందులో 16,976 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మిగతా 1,99,038 ఓట్లను పరిగణనలోకి తీసుకున్నారు.

బైక్ నుంచి పడి వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఎర్ర బురుజు ప్రాంతానికి చెందిన శివ (34) అనే వ్యక్తి బైక్ మీద నుంచి కింద మృతి చెందాడు. వృత్తిరీత్యా ఆటోడ్రైవర్ అయిన శివ శుక్రవారం తెల్లవారుజామున ఆజీర్తిగా ఉందని ఇంట్లో చెప్పి బైక్‌పై రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ జీరా తాగి వస్తుండగా ఆర్ఎస్‌రోడ్డు సర్కిల్ వద్ద బైకు మీద నుంచి కింద పడ్డాడు. స్థానికులు చూసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతునికి భార్య సునీత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేకపిల్ల తెచ్చిన తంటా

- దాయాదుల మధ్య ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: మేకపిల్ల ఆటో కిందకు దూరడం, అదిలించిన సందర్భంగా మాటా మాటా పెరిగి దాయాదుల మధ్య గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. కొసనాపల్లె గ్రామానికి చెందిన రాందాసు, సుధాకర్ దాయాదులు. రాందాసుకు చెందిన మేకపిల్ల వారి ఇళ్ల వద్ద ఉన్న ఆటో కిందకు దూరింది. మేకపిల్లను అదిలించడానికి సుధాకర్‌కు చెందిన కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాన్ని తప్పుగా అర్థం చేసుకున్న రాందాసు వాగ్వాదానికి దిగాడు. అక్కడకు చేరుకున్న సుధాకర్‌తో మాటామాట పెరిగింది. ఈ క్రమంలో రాందాసు కొడవలితో సుధాకర్‌పై దాడి చేశాడు. సుధాకర్ తలకు గాయాలయ్యాయి. సుధాకర్ కుటుంబీకుల దాడిలో రాందాసు సైతం గాయపడ్డాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఇరువర్గాల వారు పోలీసులనాశ్రయించనున్నట్లు తెలిసింది.

ఆదోని ప్రాంతంలో నూతన పంట సాగు విధానాలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చే 19 మండలాల్లో వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి నూతన పంట సాగు విధానాలను అమలు చేయాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. నూతన వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా రైతుల ఉత్పాదకతను పెంచి, కరువును నివారించవచ్చన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్, డబుల్ క్రాపింగ్ వంటి నూతన సాగు విధానాలను రైతుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. క్లస్టర్ వారీగా నూతన పద్ధతులను పాటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గుర్తించిన బీడు భూముల్లో డ్రిప్ ,స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి పశుగ్రాసాల పెంపకానికి చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ పీడీని ఆదేశించారు. తుంగభద్ర నదీ పరివాహక మండలాల్లో ఫాంపాండ్స్ తవ్వించాలన్నారు. సూక్ష్మ సేద్యం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో ఒక ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ హౌస్ టెక్నాలజీ కింద సన్న, చిన్న కారు రైతులు హైవాల్యు పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, మత్స్యశాఖ అధికారి శ్యామల పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లోని గృహాలకు ఉచితంగా మీటర్లు

ఆదోనిఅర్బన్: జగనన్న కాలనీలో ఉన్న గృహాలకు విద్యుత్ మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేస్తామని ఎస్ఈ ఉమాపతి అన్నారు. స్థానిక డీఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహాలకు మీటర్లు, వైర్లు, బోర్డులు ఉచితంగా విద్యుత్ శాఖనే ఏర్పాటు చేస్తుందన్నారు. లబ్ధిదారులు ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు వ్యవసాయం కోసం 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఇబ్బంది ఉన్న రైతులు తమ దృష్టికి తీసుకొని వస్తే ఉచిత విద్యుత్ సమయవేళలు మార్పు చేస్తామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎవరికైనా అధిక లోడు అవసరమైతే ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖకు రూ.2,800 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: స్థానిక ఎల్లమ్మ గుడి ఆవరణలో జరిగిన తేనెటీగల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం అమ్మవారి పూజల నేపథ్యంలో భక్తులు, మొక్కుబడులు చెల్లించుకునేందుకు వచ్చిన వారు, వారి బంధువులతో ఆలయ ఆవరణ నిండిపోయింది. ఈ క్రమంలో గుడి వెనుక రైలుపట్టాల వద్ద ముళ్ల కంపలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. పొగ వ్యాపించడంతో అక్కడున్న తేనెతుట్టె నుంచి ఈగలు లేచి భక్తులపై దాడిచేశాయి. అక్కడ మొక్కులు చెల్లించుకునే వారి కార్యక్రమంలో డప్పు కొడుతున్న చిన్న పుల్లయ్య, దాసుపై గుంపులుగా కుట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.